క్లుప్తంగా

నేడు మండల మీట్

దొర్నిపాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆదివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ ఎంపీడీఓ శివప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ గోపవరం అమర్‌నాథరెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడి ఎన్నిక

నంద్యాల(అర్బన్): సాంఘిక సంక్షేమ శాఖ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా బెల్లం వెంకటసుబ్బయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పట్టణంలోని దేవనగర్ సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో శనివారం జిల్లా స్థాయి జనరల్ బాడీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా వెంకటసుబ్బయ్య, కార్యదర్శిగా ప్రసాద్, కోశాధికారిగా బాబురావు, ఉపాధ్యక్షులుగా షోమిభాయ్, నాగరాజు, నరసింహులు, రాజారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలి

దొర్నిపాడు: ఓటరు జాబితాను బీఎల్‌ఓలు క్షుణ్ణంగా పరిశీలించాలని తహసీల్దార్ సుభద్ర ఆదేశించారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బూతు స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2005, 2025 ఓటరు జాబితాలోని ఓటర్ల పేర్లను పరిశీలించి నివేదిక తయారు చేయాలన్నారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా వేగవంతంగా పని పూర్తి చేయాలని ఆదేశించారు.

వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

ఉయ్యాలవాడ : విద్యార్థులు చదువుతో పాటు వృత్తి విద్యలో కూడా నైపుణ్యాన్ని పొందించుకోవాలని ఒకేషనల్ ట్రైనర్లు హుసేన్‌వలి, వెంకటరాముడు అన్నారు. శనివారం స్థానిక మన గ్రోమోర్ కేంద్రంలో విద్యార్థులకు పురుగు మందులు, రసాయనిక ఎరువులు వాడకం, అమ్మకాలపై అవగాహన కల్పించారు.

క్రీడా సామగ్రికి చెక్కు అందజేత

నంద్యాల: అనంతపురం జిల్లాలో నవంబర్ 7, 8, 9 తేదీల్లో జరగనున్న 7వ రాష్ట్ర రెవెన్యూ క్రీడా సాంస్కృతికోత్సవాల్లో పాల్గొనబోయే నంద్యాల జిల్లా రెవెన్యూ ఉద్యోగుల కోసం జిల్లా కలెక్టర్ రూ.1.50 లక్షల చెక్కును ఏపీఆర్ఎస్‌ఏ నంద్యాల జిల్లా కార్యవర్గానికి అందజేశారు. ఈ సందర్భంగా ఏపీఆర్ఎస్‌ఏ జిల్లా అధ్యక్షుడు కామేశ్వర రెడ్డి మాట్లాడుతూ క్రీడా సామగ్రి కొనుగోలుకు కలెక్టర్ సాయం అందించడంపై కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏపీజేఏసీ జిల్లా చైర్మన్, ఏపీఆర్ఎస్‌ఏ జిల్లా కార్యదర్శి రామచంద్రరావు, ఏపీఆర్ఎస్‌ఏ రాష్ట్ర కార్యదర్శి శూలం విజయ శేఖర్, జిల్లా సహాధ్యక్షుడు పత్తి సత్య శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎస్సీల వర్గీకరణ తగదు

నంద్యాల(అర్బన్): ఎస్సీ వర్గీకరణ సరికాదని రాష్ట్ర మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు అశోక్‌బాబు, జిల్లా గౌరవాధ్యక్షుడు భూషణం అన్నారు. మాల సంఘాల ఐక్యవేదిక, మాల న్యాయవాదుల ఆధ్వర్యంలో పట్టణంలో రాజ్యాంగ పరిరక్షణ యాత్ర చేపట్టారు. ప్రభుత్వ ఆసుపత్రి నుంచి సాయిబాబానగర్, పద్మావతినగర్, మున్సిపల్ కార్యాలయం, చామకాల్వ మీదుగా హోలీక్రాస్ కెథడ్రల్ చర్చి వరకు సాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు దళితులను విభజించి పాలించే విధానాన్ని అవలంభిస్తున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో మాల ఉద్యోగుల జేఏసీ నాయకులు సాంబశివుడు, దస్తగిరి, దేవదాసు, దేవాంతకుడు, చిన్నయ్య, లింగమయ్య, పుల్లన్న, అంబేడ్కర్, కేశవ, సుబ్బన్న పాల్గొన్నారు.

పశు సంపద పెంపునకు చర్యలు

చాగలమర్రి: పశు సంపద, పాల ఉత్పత్తి పెంపునకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఆళ్లగడ్డ డివిజన్ పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు రమణయ్య అన్నారు. శనివారం స్థానిక ప్రాంతీయ పశువైద్య శాలలో ఏడీ వరప్రసాద్ ఆధ్వర్యంలో చాగలమర్రి, ఉయ్యాలవాడ మండలాల పశువైద్యుల సమీక్షా సమావేశం జరిగింది. ఇందులో రమణయ్య మాట్లాడుతూ గేదెలకు పెయ్య దూడలు మాత్రమే పుట్టేందుకు వీలుగా రూపొందించిన లింగ నిర్ధారిత వీర్యం రూ.150కే అందజేస్తున్నామన్నారు.

ఐక్యతతో సంఘాల అభివృద్ధి

నంద్యాల(న్యూటౌన్): అందరి ఐక్యమత్యంతోనే సంఘాలు అభివృద్ధి చెందుతాయని నంద్యాల డయాసిస్ అధ్యక్ష ఖండం పీఠాధిపతులు బిషప్ ది రైట్ రెవరెండ్ సంతోష్‌ప్రసన్నరావు అన్నారు. శనివారం చర్చ్ ఆఫ్ సౌత్ ఇండియా 79వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సీఎస్ఐ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో నంద్యాల డయాసిస్ సెక్రటరీ బ్రైట్ ప్రభుదాస్, ట్రెజరర్ నందం ఐజక్, అసోసియేట్ ట్రెజరర్ బండిసామేల్, సభ్యులు పాల్గొన్నారు.

వదలని వర్షం

ఉయ్యాలవాడ/రుద్రవరం/శిరివెళ్ల: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గత కొద్ది రోజులుగా వర్షం కురుస్తూనే ఉంది.శనివారం కురిసిన వానకు రుద్రవరం, శిరివెళ్ల, ఉయ్యాలవాడ మండలాల్లో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. దీంతో వివిధ గ్రామాల ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలిగింది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి భారీగా నీరు వదలడంతో కుందూనది ఉధృతంగా ప్రవహిస్తోంది.దీంతో నదితీరా గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రెవెన్యూ అధికారులు హెచ్చరిస్తూ గ్రామాల్లో టాంటాం వేయించారు.

బాలాత్రిపుర సుందరి.. నమోస్తుతే

నంద్యాల(వ్యవసాయం): దసరా శరన్నవరాత్రులు అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఆరో రోజైన శనివారం అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. నంద్యాల పట్టణంలోని శ్రీకాళికాంబదేవాలయంలో బాలాత్రిపురసుందరిగా, బాలాజీ కాంప్లెక్స్ కల్యాణ మండపంలో శ్రీనారాయిని దేవిగా, వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో శ్రీకృష్ణమాయి దేవిగా, సంజీవనగర్ రామాలయంలో అన్నపూర్ణాదేవిగా, బ్రహ్మానందీశ్వరస్వామి ఆలయంలో గంగా, కామేశ్వరిదేవిలు కంచికామాక్షి దేవి, స్కందమాతలుగా, బొమ్మలసత్రం శ్రీషిర్డిసాయిబాబా ఆలయంలో దుర్గాదేవిగా, మల్లికార్జునస్వామి గుడిలో కామేశ్వరి మాతగా అలంకరించారు. బైర్మల్‌వీధిలోని ఆంధ్రాబ్యాంక్ వద్ద, జగజ్జననీ దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిగాయి.అలాగే నంద్యాల రూరల్, గోస్పాడు, ఆళ్లగడ్డ, చాగలమర్రి, ఉయ్యాలవాడ, రుద్రవరం, శిరివెళ్ల, దొర్నిపాడు మండలాల్లో శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా సాగాయి.

అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

చాగలమర్రి: మండల కేంద్రమైన చాగలమర్రిలో వెలసిన శ్రీమత్కన్యకాపరమేశ్వరిదేవిని శనివారం ఆళ్లగడ్డ మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి దర్శించుకున్నారు. ఆర్యవైశ్య సభ పాలకవర్గం ఆయనకు ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు, హోమం చేయించింది. అనంతరం గంగుల బిజేంద్రారెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది పాడి పంటలు సంవృద్ధిగా పండి ప్రజలు సుఖశాంతులతో వెలుగొందాలని అమ్మవారిని మొక్కుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ వీరభద్రుడు, జి.కుమార్ రెడ్డి, పాలకవర్గం అధ్యక్షుడు ఎం.లక్ష్మీణారాయణ, ధర్మకర్త వంకదార లక్ష్మణబాబు, ఉపాధ్యక్షులు బచ్చు సుబ్రమణ్యం, ప్రధాన కార్యదర్శి కె.రామక్రిష్ణ వరప్రసాద్, ఉప కార్యదర్శి ఎం.వెంకటేశ్వరబాబు, వాసవి యువజన సంఘం అధ్యక్షుడు తొమ్మంద్రు వినోద్ కుమార్, వైస్ ఎంపీపీ ముల్లా రఫి, ఉప సర్పంచ్ మహమ్మద్ సోహెల్, మాజీ జెడ్పీటీసీ రామగుర్విరెడ్డి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి శేషు రమేష్, ఒంటెద్దు రఘునాథ్‌రెడ్డి, ఎంపీటీసీలు పత్తి నారాయణ, కె.లక్ష్మీరెడ్డి, రాష్ట్ర సేవాదళ్ ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, జిల్లా అధ్యక్షుడు గణేష్ రెడ్డి, వార్డు సభ్యులు వెంకట రమణ, ముల్లా బురాందీన్, మాజీ సర్పంచ్‌లు చిన్న రాముడు, రమణారెడ్డి, మల్లారెడ్డి, దూదెకుల బాబు పాల్గొన్నారు.


నంద్యాలలో బాలత్రిపుర సుందరిదేవి అలంకరణలో కాళికాంబాదేవి


బ్రహ్మనందీశ్వరస్వామి ఆలయంలో కంచికామాక్షి దేవి, స్కందమాతలుగా గంగాదేవి, కామేశ్వరిమాత


ఆళ్లగడ్డలో మహాలక్ష్మి అలంకరణలో వాసవీమాత


శ్రీకన్యకాపరమేశ్వరిదేవిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి


దొర్నిపాడు.. శరన్నవరాత్రోత్సవ పూజల్లో పాల్గొన్న భక్తులు


నంద్యాల..జగజ్జననీ ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు


ముత్యాలపాడు గ్రామంలో గజలక్ష్మీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు

భూమిలో సేంద్రియ కర్బనం పెంపుపై దృష్టి సారించాలి

● జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: భూమిలో సేంద్రియ కర్బన శాతం పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి అన్నారు.ఈ అంశంపై శనివారం ఆమె తన చాంబర్‌లో నాబార్డ్ డీడీ కార్తికేయ, డ్వామా పీడీ సూర్యనారాయణ, తదితర అధికారులతో చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో భూముల్లో సగటు కార్బన్ కంటెంట్ 0.3 శాతం మాత్రమే ఉందని, దీన్ని కనీసం 0.75 శాతానికి పెంచేలా ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలన్నారు. కార్బన్ కంటెంట్ పెంపు కోసం సేంద్రీయ వ్యవసాయ పద్ధతులు, పంటల మార్పిడి,సంవత్సరంలో 365 రోజుల పాటు పంటల సాగు, పంట అవశేషాలను భూమిలో కలపడం వంటి చర్యలు రైతులు చేపట్టాలని సూచించారు. బయోచర్ (బొగ్గు పొడి) వాడకం కూడా భూమి నాణ్యత ను మెరుగుపరుస్తుందని పేర్కొన్నారు.నాబార్డ్ డీడీ కార్తికేయ మాట్లాడుతూ వెదురు కలప పెంపునకు అనువైన భూముల గుర్తింపు ప్రక్రియ జరుగుతుందన్నారు. జిల్లాలో భూమి నాణ్యతను పెంచడం, సుస్థిర వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం, రైతులకు ఆర్థిక లాభాలు కలిగించడం వంటి అంశాల్లో సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి త్వ రితగతిన అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

ఈవీఎం గోదాముల పరిశీలన

నంద్యాల(అర్బన్):టెక్కె మార్కెట్ యార్డ్‌లోని గోదాముల్లో భద్రపరిచిన ఈవీఎంలను జిల్లా కలెక్టర్ రాజకుమారి శనివారం పరిశీలించారు. వెంట గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉన్నారు. విధుల నిర్వహణలో జాగ్రత్తగా వ్యవహరించాలని భద్రత సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ రామునాయక్, ఆర్డీఓ విశ్వనాథ్, తహసీల్దార్ సత్య శ్రీనివాసులు, ఎలెక్షన్ డీటీ మనోహర్, రాజకీయ పార్టీల తరపున కాంగ్రెస్ నుంచి సయ్యద్ రియాజ్ బాషా, వైఎస్సార్‌సీపీ నుంచి సాయిరాం రెడ్డి, టీడీపీ నుంచి శివరామిరెడ్డి, సీపీఎం నుంచి నరసింహులు, బీజేపీ నుంచి కొట్టె చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మహిళల హక్కులపై ఉద్యమాలకు సిద్ధం కండి

నంద్యాల(న్యూటౌన్): మహిళల హక్కుల సాధన కోసం ఉద్యమాలకు సిద్ధం కావాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రమాదేవి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాలలోని ఆడిటోరియంలో ఐద్వా జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఐద్వా అధ్యక్షురాలు నిర్మల అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ మహిళలపై, చిన్నారులపై దాడులు అధికమయ్యాయని, వీటిని అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని విమర్శించారు. అధికారంలోకి రాకముందు చంద్రబాబునాయుడు మహిళలను అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పిస్తామని చెప్పి ఇప్పుడు పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికల సమయంలో ప్రతి మహిళకు ఆడబిడ్డ నిధి కింద నెలకు రూ.1500 ఇస్తామని చెప్పి ఇప్పటి వరకు ఇవ్వలేదన్నారు. ఇంటికి మూడు సిలిండర్లు, తల్లికి వందనం పథకం అమలులో కూడా విఫలమైందన్నారు. ఫ్రీ బస్సు కూడా కొన్నింటికే పరిమితం చేయడం దారుణమన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇంటి నిర్మాణానికి బ్యాంకుల ద్వారా నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు లక్ష్మణ్, మహమ్మద్, మహిళా సంఘం నాయకురాలు హైమావతి, లలితమ్మ, ప్రసన్న, నాగరాణి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రమాదేవి

దసరా పోటీలకు ఆహ్వానం

నంద్యాల(వ్యవసాయం): దసరా పండుగను పురస్కరించుకొని కళారాధన సాంస్కృతిక సంస్థ, మధుర స్వీట్స్, భవనాశి వెంకటసుబ్బయ్యశెట్టి, వెంకమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాల్లో వచ్చేనెల 1వ తేదీన దసరా వేషాల పోటీలు నిర్వహిస్తున్నారు. వివరాలకు సెల్ నంబర్: 8897727727, 8340006066 కు సంప్రదించాలని నిర్వాహకులు శనివారం ఓ ప్రకటనలో కోరారు.

పెన్షనర్ల సంఘం ఎన్నికల్లో రామసుబ్బయ్య విజయం

నంద్యాల(అర్బన్): జిల్లా ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఎన్నికల్లో రామసుబ్బయ్య ప్యానల్ (ఏనుగు గుర్తు), పుల్లారెడ్డి ప్యానల్ (ఫుట్ బాల్ గుర్తు)పై విజయం సాధించింది. మొత్తం 3,400 మంది ఓటు హక్కు కలిగి ఉన్న ఈ సంఘానికి 12ఏళ్ల తర్వాత శుక్రవారం ఎన్నికలు జరిగాయి. 799మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు.అదేరోజు సాయంత్రం నుంచి ఓట్ల లెక్కింపు మొదలైంది. శనివారం వెలువడిన ఫలితాల్లో పుల్లారెడ్డిపై రామసుబ్బయ్య 130 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. సహ అధ్యక్షుడిగా గఫార్, కోశాధికారిగా కాశీంవలి, ఉపాధ్యక్షులుగా సీహెచ్ డేవిడ్, ప్రధాన కార్యదర్శిగా మేకల లింగస్వామి గెలుపొందారు.

కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెబుతాం

ఉయ్యాలవాడ : దొమ్మరి కులానికి గిరి బలిజగా పేరు పెట్టి ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నంబర్ 5ను రద్దు చేయకపోతే కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెబుతామని ఆళ్లగడ్డ తాలూకా బలిజ సంఘం గౌరవాధ్యక్షుడు అర్జిగారి నరసింహుడు, మండల బలిజ సంఘం అధ్యక్షుడు ఆకుల నడిపి వెంకటసుబ్బయ్య, సాగునీటి సంఘం చైర్మన్ ఆకుల వెంకటసుబ్బయ్య హెచ్చరించారు. జీఓ నంబర్ 5 విడుదలను నిరసిస్తూ శనివారం స్థానిక కమతం వీధిలోని శ్రీ కృష్ణదేవరాయుల విగ్రహానికి పూలమాల వేసి ర్యాలీగా రెవెన్యూ కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్ ప్రసాద్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దొమ్మరి కులానికి కొత్తపేరు గిరి బలిజగా పెట్టడం జరిగిందని, బలిజ పేరును తొలగించాలన్నారు. లేని పక్షంలో కూటమి ప్రభుత్వం నిలబెట్టే అభ్యర్థులను ఓడించి తమ సత్తా చాటుతామన్నారు. రాష్ట్రంలో 25 శాతం ఉన్న బలిజలకే న్యాయం చేయకపోతే మిగిలిన వారి పరిస్థితి ఏంటని వారు ప్రశ్నించారు. కార్యక్రమంలో గ్రామ బలిజ సంఘం గౌరవాధ్యక్షుడు జింకా వెంకటస్వామి, ఆకుల సురేంద్ర, మండలంలోని 21 గ్రామాల నుంచి వచ్చిన బలిజ సంఘం కార్యకర్తలు పాల్గొన్నారు.


ఉయ్యాలవాడలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బలిజ సంఘం నాయకులు

ఆకట్టుకున్న ఎన్‌సీసీ సాంస్కృతిక పోటీలు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక రామకృష్ణ అటానమస్ డిగ్రీ కళాశాలలో జాతీయ స్థాయి ఎన్‌సీసీ క్యాడెట్ల సాంస్కృతిక పోటీలు ఆకట్టుకున్నాయి. ఎన్‌సీసీ ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్ క్యాంపులో భాగంగా నిర్వహించిన ఈ పోటీల్లో వివిధ రాష్ట్రాల ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు. ముందుగా కర్నూలు గ్రూప్ కమాండర్ కల్నల్ త్రిపాఠి, కళాశాల చైర్మన్ రామకృష్ణారెడ్డి పోటీలను ప్రారంభించారు. పాటల పోటీలు సోలో, గ్రూపు, డ్యాన్స్ పోటీలు సోలో, గ్రూపులుగా నిర్వహించారు. విజేతలకు ఈనెల 30వ తేదీ బహుమతులు అందజేస్తారు. ఈ కార్యక్రమంలో జడ్జీలుగా లెఫ్టినెంట్ కల్నల్ శ్రీప్రియ, లెఫ్టినెంట్‌లు సుమిత, శ్యామల, శామ్యూల్ కిస్కు, ప్రియాంక సింగ్, డాక్టర్ లలిత సరస్వతి వ్యవహరించారు.

మాతా శిశు సంరక్షణే ధ్యేయం

శిరివెళ్ల: మాతా శిశు సంరక్షణే ధ్యేయంగా తమ శాఖ పని చేస్తుందని డీఎం అండ్ హెచ్‌ఓ వెంకట రమణ అన్నారు. శనివారం యర్రగుంట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ నారీ- స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ వైద్య శిబిరంలో మహిళల ఆరోగ్యమే లక్ష్యంగా అన్ని రకాల వైద్య పరీక్షలు చేస్తున్నట్లు చెప్పారు. గర్భిణీ, బాలింత, బీపీ, షుగర్, టీబీ వంటి వ్యాధులకు శిబిరంలో వైద్య పరీక్షలు చేస్తున్నామన్నారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబమంతా ఆరోగ్యంగా ఉన్నట్లున్నారు. గర్భిణులకు తమ సిబ్బంది తగిన సూచనలు, సలహాలు ఇస్తున్నారని ప్రసవం నుంచి బాలింత వరకు తగిన ఆరోగ్య జాగ్రత్తలు తీసుకుంటున్నారన్నారు. మహిళలకు ఐసీడీఎస్ పౌష్టికాహారం అందిస్తుందన్నారు. కార్యక్రమంలో వైద్యశాల డాక్టర్లు ఫిరోజ్, కావ్య చందన, ఎంపీహెచ్‌ఓ నాగార్జునరెడ్డి, పీహెచ్‌ఎన్ ప్రమిలమ్మ, సూపర్‌వైజర్లు శ్రీనివాసులు, వెంకట లక్ష్మి పాల్గొన్నారు.

మహిళలకు ఆరోగ్యంపై అవగాహన

చాగలమర్రి: మండల కేంద్రమైన చాగలమర్రిలోని ఆర్‌సీఎం పాఠశాలలో శనివారం స్వస్త్ నారీ- స్వశక్తి పరివార్ అభియాన్ పథకం కింద ఎంఎల్‌హెచ్‌పీ సురేంద్రబాబు ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఇందులో మహిళలకు ఆరోగ్యానికి సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. రొమ్ము, గర్భాశయ క్యాన్సర్ రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. 40 మందికి వివిధ రకాల రక్త పరీక్షలు నిర్వహించి వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం గార్లెట్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.


శిబిరంలో వైద్య పరీక్షలను పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ

పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

నంద్యాల(న్యూటౌన్): వీఓఏలకు పని భారం తగ్గించి పెండింగ్ వేతనాలు వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, వీఓఏల సంఘం జిల్లా నాయకులు మిట్నాల తిరుపతయ్య డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో వీఏఓల సంఘం జనరల్ బాడీ సమావేశం భాస్కర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పై నాయకులు మాట్లాడుతూ సర్కారు రోజుకు ఒక యాప్ విడుదల చేస్తూ వీఓఏలపై పని భారం పెంచుతుందన్నారు. వీఓఏలకు అన్యాయం కలిగించే కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని, కనీసం వేతనం ఇవ్వాలని, రూ.10 లక్షల గ్రూప్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని, ఉద్యోగ భద్రతతో పాటు రాజకీయ వేధింపులు అరికట్టాలని కోరారు. అనంతరం వీఓఏల సంఘం జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మార్గదర్శకులు ఉపాధ్యాయులు

నంద్యాల(వ్యవసాయం): ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శకులని మాతృభాషా పరిరక్షణ సమితి అధ్యక్షుడు డాక్టర్ దీవి హయగ్రీవాచార్యులు, నంది రైతుసమాఖ్య గౌరవ సలహాదారులు, విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ ఖాదరబాద్ రవీంద్రనాథ్ అన్నారు. శనివారం నంద్యాలలోని నంది రైతు సమాఖ్య కార్యాలయంలో నంది రైతు సమాఖ్య, మాతృ భాషా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్న ఉపాధ్యాయులు అవ్వారి శేషఫణి, పీవీ సుబ్బయ్యను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు ముత్తోజు వీరబ్రహ్మం, వెంకటరమణ మూర్తి, డాక్టర్ సహదేవుడు, షరీఫ్ , మనోహర రెడ్డి, వివిధ సామాజిక, సాహితీ సంస్థల ప్రతినిధులు డాక్టర్ కిశోర్ కుమార్, అన్నెం శ్రీనివాసరెడ్డి డాక్టర్ నీలం వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డి, మధుసూదనరెడ్డి, ఓబుళపతి, ఉపాధ్యాయులు నరేంద్ర, మాబుబాషా, ప్రసాద్, నీలకంఠమాచారి, పాల్గొన్నారు.


కియా షోరూంను ప్రారంభిస్తున్న దృశ్యం

● అందుబాటులోకి కియా కార్లు

గోస్పాడు: నంద్యాల జిల్లా ప్రజలకు కియా వాహనాలను అందుబాటులోకి తెచ్చామని ఎంజీబీ గ్రూప్ సీఈఓ ఆదిత్య మాచాని అన్నారు. దీబగుంట్ల వద్ద కియా షోరూమ్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక నుంచి కియా కార్ల కొనుగోలుకు ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. అమ్మకాలు, సర్వీసులకు ఇబ్బందులు ఉండకూడదని స్థానికంగానే షోరూంను ఏర్పాటు చేశామన్నారు. ఆసక్తి గలవారు షోరూంను సందర్శించి టెస్ట్ డ్రైవ్ చేయవచ్చునన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, ఎంజీబీ గ్రూప్ మెంబర్ తారకేశ్వర్, జనరల్ మేనేజర్ ఎల్లప్ప, ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తం

నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు

దొర్నిపాడు:ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న వైద్యాధికారులు శనివారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. దొర్నిపాడులో డాక్టర్ వెంకటశివ, డాక్టర్ రుహుల్లాఖాన్, డబ్ల్యూ కొత్తపల్లెలో ఉసేని, జ్యోతి నల్లబ్యాడ్జీలు ధరించి రోగులకు చికిత్సలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 20 ఏళ్ల నుంచి పదోన్నతులు లేవన్నారు. పీజీ సర్వీసును 30 శాతం నుంచి 15 శాతంకు తగ్గించారన్నారు. ఇందుకు నిరసనగా తాము నల్లబ్యాడ్జీలు ధరించినట్లు వెల్లడించారు.

యాజమాన్య పద్ధతులతో గులాబీ పురుగు నివారణ

నంద్యాల(అర్బన్): పత్తిని ఆశించిన గులాబీ రంగు పురుగును యాజమాన్య పద్ధతులు చేపట్టడం ద్వారా నివారించుకోవచ్చని ఆర్ఏఆర్ఎస్ ఇన్‌చార్జ్ ఏడీఆర్ డాక్టర్ అశోక్‌కుమార్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో శనివారం శిక్షణ, సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్త డాక్టర్ శివరామకృష్ణ, శాస్త్రవేత్త ఇషా పర్వీన్, జిల్లా వ్యవసాయాధికారి మద్దిలేటి, ఏడీఏ అరుణకుమారి, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ కార్యవర్గం ఎన్నిక

నంద్యాల(న్యూటౌన్): శిరివెళ్ల మండలం ఏపీటీఎఫ్ కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. నంద్యాల పట్టణంలోని ఏపీటీఎఫ్ 257 కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. శిరివెళ్ల మండల అధ్యక్షుడిగా మహేశ్వరరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులుగా మధు వెంకటేశ్వర్లు శ్రీధర్, తిమ్మారెడ్డి, ఈశ్వరయ్య, పద్మావతి, కార్యదర్శులుగా ప్రవీణ్‌కుమార్, సుధాకర్‌రెడ్డి, హుసేన్‌బాషా, రమాదేవి, రంగస్వామిలతో పాటు జిల్లా సమితి సభ్యులుగా వెంకటరమణ, జాఫర్, సుబ్రమణ్యం, రమేష్‌బాబు, రమాబాయి, నూరుల్లాలను ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి శివయ్య, పరిశీలకుడు వీరేష్‌రెడ్డి తెలిపారు.

భగత్‌సింగ్ ఆశయ సాధనకు ఉద్యమించాలి

నంద్యాల(న్యూటౌన్): భగత్‌సింగ్ ఆశయ సాధనకై యువత, విద్యార్థులు ఉద్యమించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఆర్‌నాయక్ పేర్కొన్నారు. శనివారం భగత్‌సింగ్ జయంతిని పురస్కరించుకుని ఆ సంఘం కార్యాలయంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సాయి, వరుణ్, హరీష్, అశోక్ పాల్గొన్నారు.

జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు మేలు

ఆళ్లగడ్డ: జీఎస్టీ సంస్కరణలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని ఎంపీడీఓ నూర్జహాన్ అన్నారు. సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమంలో భాగంగా శనివారం పాత కందుకూరు గ్రామంలో గ్రామ సభ నిర్వహించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ చేపట్టి అవగాహన కల్పించారు.

రేబిస్ వ్యాధిపై అవగాహన అవసరం

గోస్పాడు: రేబిస్ వ్యాధిపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని నంద్యాల మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖ అన్నారు. శనివారం ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా గవర్నమెంట్ మెడికల్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో మెడిసిన్ విద్యార్థులకు రేబిస్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కమ్యూనిటీ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ విజయకుమారి, మైక్రో బయాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సచిన్ సుమంత్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నిరంజన్, మెడిసిన్ విద్యార్థులు పాల్గొన్నారు.

సీమ జోనల్ చైర్మన్‌గా రామలింగారెడ్డి

నంద్యాల(అర్బన్): ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీయల్ ఫెడరేషన్ రాయలసీమ జోనల్ చైర్మన్‌గా నంద్యాలకు చెందిన కల్లూరి రామలింగారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం విజయవాడలోని ఏపీ చాంబర్‌లో ఆల్ ఇండస్ట్రీస్ నిర్వాహకులతో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రామలింగారెడ్డిని చైర్మన్‌గా ఎంపిక చేశారు. గతంలో చాంబర్ డైరెక్టర్‌తో పాటు ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ ఫెడరేషన్ ప్రెసిడెంట్‌గా కల్లూరి రామలింగారెడ్డి ఉన్నారు.